క్లుప్తంగా

ఆల్ఇండియా ఇంటర్ వర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ కేయూ జట్టు



కేయూ క్యాంపస్: చెన్నైలోని జయపూర్ యూనివర్సిటీలో మే 31నుంచి జూన్ 3వ తేదీ వరకు జరగబోయే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ (పురుషుల) జట్టును ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య శుక్రవారం తెలిపారు. ఈ జట్టుకు ఖమ్మం ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మధు మేనేజర్‌గా వ్యవహరించనున్నట్లు వివరించారు.

నేడు 'సుమతిరెడ్డి'లో ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్

హసన్‌పర్తి: ఎస్ఆర్ యూనివర్సిటీ ఆవరణలోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సాయంత్రం ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్‌ను నిర్వహించనున్నట్లు డాక్టర్ రాజశ్రీరెడ్డి తెలిపారు. కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో ఫైనల్ ఇయర్‌కు చెందిన 282 మంది విద్యార్థినులు వివిధ ఎంఎన్‌సీ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని వివరించారు. ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్‌కు ఎస్ఆర్ యూనివర్సిటీ చాన్సలర్ ఎ.వరదారెడ్డి హాజరు కానున్నారని పేర్కొన్నారు. సమావేశంలో అధ్యాపకులు డాక్టర్ సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ మహేందర్, డాక్టర్ వాణిశ్రీ, ఏట వేణుగోపాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

2న 'గీతం' అవగాహన సదస్సు

విద్యారణ్యపురి: గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ హైదరాబాద్ ప్రతినిధులు జూన్ 2న హనుమకొండలోని అశోకా హోటల్ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ స్కూల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ బందన్ కుమార్‌మిశ్రా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో అధ్యాపకులు ముఖాముఖి చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 76809 93755, 95424 24259 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

3న పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలు

హన్మకొండ చౌరస్తా: ఈనెల 3వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ కాలుష్య నియంత్రణ, వరంగల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు పీసీబీ ఈఈ సునీత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మన నేల – మన భవిష్యత్, భూ పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువు నివారణ' అంశంపై పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. వరంగల్ మట్టెవాడలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉదయం 10:30 గంటలకు పోటీలు జరుగుతాయని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 5న హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో జరగనున్న కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వివరించారు.

8, 9వ తేదీల్లో డ్యాన్స్ పోటీలు

నయీంనగర్: ఈనెల 8, 9వ తేదీల్లో హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో డ్యాన్స్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు క్రాంతికుమార్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్లాసికల్, ఫోక్, వెస్టర్న్ విభాగాల్లో జూనియర్, సీనియర్, గ్రూప్, సోలోగా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 99040 56531 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో దీపక్, రాజ్‌కుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

16న రాష్ట్ర సదస్సు

హన్మకొండ: భూమిని పంచు.. బడ్జెట్ పెంచు, ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరుతూ ఈనెల 16న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ తెలంగాణ (బొజ్జ తారకం) రాష్ట్ర కో ఆర్డినేటర్ జన్ను సాంబయ్య తెలిపారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ తెలంగాణ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర సదస్సు కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేధావులు, ప్రొఫెసర్లు హాజరయ్యే ఈ సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల పార్టీ కోఆర్డినేటర్లు శ్రీరాముల పైడి, శంకర్, పిసరి రజిత, రెమిడీ హసీనా బేగం, ముఠి సాంబలక్ష్మి, జమ్మల నాగరాజ్, అంకెర రమేష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మడికొండ: చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి వ్యక్తి మృతిచెందిన సంఘటన మడికొండ పోలీసు స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. మడికొండ ఎస్సై రాజబాబు తెలిపిన వివరాల ప్రకారం మేరకు వరంగల్ ఎస్ఆర్ఆర్ తోటకు చెందిన గాజుల శ్రీధర్(45) కాజీపేటలో కూలీపని ముగించుకొని గతనెల 21న సాయంత్రం తిరిగి ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వెళ్తూ భట్టుపల్లి వద్ద పశువులను ఢీ కొట్టాడు. దాంతో అతని తలకు తీవ్రగాయాలు కాగా ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు గాజుల రేవంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కనుల పండువగా శోభాయాత్ర

హన్మకొండ అర్బన్: హనుమద్గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా హనుమాన్ మాలధారులు శుక్రవారం కనుల పండువగా శోభాయాత్ర నిర్వహించారు. నగరంలోని పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం స్వామివారికి మాన్య సూక్తహోమం, గోత్ర నామార్చన నిర్వహించి తీర్థ ప్రసాదాలు సమర్పించినట్లు ఆలయ చైర్మన్ బెండల అర్జున్‌రావు తెలిపారు. అనంతరం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేసి దేవాలయ ప్రాంగణం నుంచి హనుమకొండ చౌరస్తా, బాలాంజనేయ స్వామి దేవాలయం, పద్మాక్షి కాలనీ పురవీధుల మీదుగా తిరిగి దేవాలయం వరకు భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించినట్లు వివరించారు. అనంతరం మధ్యాహ్నం ఆలయంలో అన్నదానం చేసినట్లు తెలిపారు. శనివారం స్వామివారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకం, చందన సేవ, ఆకు పూజ, పూర్ణాహుతి, ధ్వజారోహణ వంటి ప్రత్యేక పూజలుంటాయని అన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బెండల అర్జున్‌రావు, హనుమద్గిరి హనుమాన్ దీక్ష అన్నదాన సేవా సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు గందె కృష్ణ, కె.రవికుమార్, సభ్యులు అంబటి నరేందర్, ఎం.మొగులయ్య, దశరథ్‌కుమార్, సుధాకర్, హనుమాన్ మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.



శోభాయాత్ర నిర్వహిస్తున్న మాలధారులు

మార్కెట్‌లో హనుమాన్ జయంతి

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లోని శ్రీలక్ష్మీ గణపతి సహిత అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి ఉత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఉదయం వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణను చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో చాంబర్ ప్రధాన కార్యదర్శి మడూరి వేదప్రకాష్, అన్ని సెక్షన్ల అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, హనుమాన్ మాలధారులు, రైతులు, వ్యాపారులు, మార్కెట్ సిబ్బంది, గుమస్తాలు, హమాలీ కార్మికులు, భక్తులు పాల్గొన్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.



హనుమాన్ దేవాలయంలో అన్నదానం

నేడు శివనగర్‌లో శోభాయాత్ర

ఖిలా వరంగల్: హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం సాయంత్రం శివనగర్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పురవీధుల్లో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు శ్రీరాం రాజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శోభాయాత్రలో పాల్గొని భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

హనుమాన్ భక్తులకు వాటర్ బాటిళ్ల పంపిణీ

కాజీపేట రూరల్: కాజీపేట 48వ డివిజన్ దర్గాలో హనుమాన్ భక్తులకు స్థానిక నాయకులు శుక్రవారం వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా దర్గాలో పలువురు నాయకులు తాగునీరు అందజేశారు.

ధూమపానానికి దూరంగా ఉండాలి



ఖిలా వరంగల్: మాట్లాడుతున్న పరశురాములు



కాజీపేట జంక్షన్‌లో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఖిలా వరంగల్: పొగాకు, సిగరెట్ల వినియోగంతో ఊపిరితిత్తులు, గుండె, కాలేయ సంబంధిత క్యాన్సర్ వ్యాధులు వస్తాయని సామాజిక వేత్త మండల పరశురాములు హెచ్చరించారు. ఈక్రమంలో ధూమపానానికి దూరంగా ఉండాలని సూచించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వరంగల్ రంగశాయిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇన్‌చార్జ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కే.వేదవి అధ్యక్షతన పొగాకు వినియోగంతో వచ్చే అనర్థాలపై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తి వినియోగంలో 27శాతం వినియోగదారులతో ప్రపంచంలో తమ దేశం రెండో స్థానంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పొగాకు వినియోగం వల్ల ప్రతీ సంవత్సరం 3.5లక్షల మంది మరణిస్తున్నారని వాపోయారు. సమావేశంలో పట్టణ ఆరోగ్య సిబ్బంది విజయలక్ష్మి, భ్యాగలక్ష్మి, విజయ, జయమణి, స్థానికులు పాల్గొన్నారు.

నో టొబాకో డే, పర్యావరణ దినోత్సవం

కాజీపేట రూరల్: వరల్డ్ నో టొబాకో డే, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాజీపేట జంక్షన్‌లోని ప్రయాణికులకు రైల్వే అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు క్యాన్సర్‌కు కారకాలని హెచ్చరించారు. అలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అదే విధంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని చెప్పారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో కాజీపేట రైల్వే చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, డిప్యూటీ స్టేషన్ మాస్టర్, టీటీలు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్ సరళిపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ సరళిపై సిబ్బంది పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని బల్దియా కమిషనర్, ఏఆర్‌ఓ అశ్విని తానాజీ వాకడే సూచించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో కౌంటింగ్ విధానంపై కంప్యూటర్ ఆపరేటర్లు, సిబ్బందికి శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడారు. వరంగల్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని 106 – వరంగల్ (తూర్పు) నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సరళి గురించి వివరించారు. సమావేశంలో తహసీల్దార్లు ఇక్బాల్ నాగేశ్వరరావు, ఎన్నికల డీటీ సుభాన్, మాస్టర్ ట్రైనీలు సందీప్ కుమార్, నాగరాజు, నాగేశ్వరరావు, ఐటీ మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు సంఘటితంగా పోరాడాలి



అభివాదం తెలుపుతున్న వినయ్‌భాస్కర్, సారయ్య, కార్మిక సంఘాల నాయకులు

హన్మకొండ: సమస్యల పరిష్కారానికి కార్మికులు సంఘటితంగా పోరాడాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ సూచించారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో కార్మిక సదస్సు శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలపై కార్మికులు అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కార్మిక భవన్ నిర్మాణానికి 2,400 గజాల స్థలంతో పాటు రూ.2 కోట్లు కేటాయించినట్లు వివరించారు. కార్మికుల సమస్యలపై త్వరలోనే హనుమకొండలో రాష్ట్రస్థాయి కార్మికుల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సులో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కార్మిక నాయకులు రాంబాబు, డాక్టర్ పుల్ల శ్రీనివాస్, నాయిని రవి, ఎంజలా మల్లేశం, రవీందర్ రెడ్డి, సంజీవ్, కాటాపూర్ రాజు, ఇస్మాయిల్, సతీష్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సర్వర్, ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం



మల్లేశం దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

రామన్నపేట: ఉద్యోగుల సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభించనున్నట్లు టీఎన్జీవోస్ కేంద్ర సంఘ అధ్యక్షుడు మారం జగదీశ్వర్ తెలిపారు. హనుమకొండ జిల్లా టీఎన్జీవోస్ ఉపాధ్యక్షుడు పల్లోరి మల్లేశం.. కేఎంసీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ పదవి విరమణ పొందగా, యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో కేఎంసీలోని ఎన్ఆర్ఐ భవన్‌లో శుక్రవారం పదవి విరమణ సభను నిర్వహించారు. ఈ సమావేశానికి కేఎంసీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్ హాజరు కాగా, జగదీశ్వర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అనంతరం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి మరోసారి ఉద్యోగుల సమస్యలు విన్నవిస్తామని పేర్కొన్నారు. అనంతరం మల్లేశం దంపతులను కేఎంసీ సిబ్బంది, టీఎన్జీవోస్ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ ఏడీ యాదగిరి, టీఎన్జీవోస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రామ్‌కిషన్, కార్యదర్శి వేణుగోపాల్, ములుగు జిల్లా అధ్యక్షుడు పోలు రాజు, హనుమకొండ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘ నాయకులు శ్యాంసుందర్, కత్తి రమేష్, మోయిస్, లక్ష్మీప్రసాద్, జిల్లా నాయకులు సదానందం, సలీం, రాజమౌళి, రాజేష్‌ఖన్నా, సురేష్, రాంప్రసాద్, భరత్, అనూప్, పైడి రాజు, శివ, తదితరులు పాల్గొన్నారు.

విరమణ ఉద్యోగానికే.. సర్వీస్‌కు కాదు

విద్యారణ్యపురి: ఉద్యోగ విరమణ ఉద్యోగానికి మాత్రమేనని, సమాజసేవకు కాదని తెలంగాణ జలవనరుల అభివృద్ధి మండలి మాజీ చైర్మన్ వి.ప్రకాశ్ అన్నారు. హసన్‌పర్తి ఇన్‌చార్జ్ ఎస్‌డబ్ల్యూఓ గ్రేడ్ –1 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రగల్లపాటి విజయలక్ష్మి ఉద్యోగ విరమణ సభను హనుమకొండలోని స్వాగత్ గ్రాండ్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హేతువాద, నాస్తిక ఉద్యమాల్లో విజయలక్ష్మి పాత్ర మరువలేనిదని కొనియాడారు. హెచ్‌డబ్ల్యూఓ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ అధ్యక్షత వహించగా కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ శైలజ, ఉపాధ్యాయ ఉద్యమ మాజీ నేతలు రమాదేవి, సుధీర్‌బాబు, రాంబ్రహ్మం, ఓంబ్రహ్మం, అకుట్ అధ్యక్షుడు ప్రొఫెసర్ శ్రీనివాస్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, కేయూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాధు రాజేష్, న్యూ డెమొక్రసీ నాయకులు నున్నా అప్పారావు, చైతన్య, మహిళా సంఘం నేతలు అనిత, కళ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రకాశ్

ఉర్సుగుట్ట డంపింగ్ యార్డును ఎత్తేస్తాం



దారిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవి

ఖిలా వరంగల్: ఉర్సుగుట్ట రంగలీల మైదానంలో బల్దియా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్ యార్డ్‌ను త్వరలోనే ఎత్తివేస్తామని కార్పొరేటర్ మరుపల్లి రవి, సీఎంహెచ్‌ఓ రాజేష్ అన్నారు. ఈమేరకు వరంగల్ ఉర్సుగుట్ట వద్ద స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవితో కలిసి బల్దియా అధికారులు డంపింగ్ యార్డ్‌ను శుక్రవారం పరిశీలించారు. అనంతరం వారు వాకర్స్‌తో కలిసి వాకింగ్ చేసి ఇబ్బందులను పరిశీలించి మాట్లాడారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్‌ను తొలగింపునకు చర్యలు చేపడుతామని, రంగలీల మైదానానికి వెళ్లే వాకింగ్ రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్ల పొదలను జేసీబీ సహాయంతో పూర్తిగా తొలగిస్తామని, కంకర తేలిన రోడ్డుపై మట్టిపోసి చదును చేస్తామని వాకర్స్‌కు హామీఇచ్చారు. కార్యక్రమంలో రాజు, మోహన్, కుమార్, కోటి, రవియాదవ్, రమేష్‌బాబు, శ్రీపతి కుమార్, గుర్రపు కిరణ్, లక్ష్మణ్, కోదాటి శ్రీధర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థినుల ప్రతిభ



సంజన



అశ్రిత



వైష్ణవి

హసన్‌పర్తి: మేధా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ఆరెపల్లిలోని మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. ఎంపికైన ఎస్.సంజన, బి.అశ్రిత, ఎస్.వైష్ణవికి మేధా చారిటబుల్ ట్రస్ట్ ఆరేళ్ల పాటు ఉచిత విద్య అందించనుందని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థినులను పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యాయులు వి.స్వప్న, ఎన్.జీవిత, సన్నిత, అన్నపూర్ణ, కవిత శుక్రవారం అభినందించారు.

మహిళా సిటీ ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షుల నియామకం

కాశిబుగ్గ: వరంగల్ సిటీ కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలిగా కాశిబుగ్గ చెందిన సుల్తాన్ సమ్మక్క, సిటీ ప్రధాన కార్యదర్శి పల్లకొండ రాజమణిని నియమించినట్లు నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నారగోని స్వప్నగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు వారికి నియామక ఉత్తర్వులను మంత్రి సురేఖ శుక్రవారం అందజేశారు.

డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా రాతు రమేష్ కుమార్



హన్మకొండ: దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా రౌతు రమేష్‌కుమార్ నాల్గవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాదులో డీబీఎఫ్ రాష్ట్ర నాలుగవ మహాసభ గురువారం జరిగింది. ఈ మేరకు మహాసభలో రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తికి చెందిన రమేష్ కుమార్ రాష్ట్ర అధ్యక్షుడిగా వరుసగా నాల్గవసారి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, దేవన్నపేటకు చెందిన చుంచు రాజేందర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, జిల్లాకు చెందిన బొర్ర సంపూర్ణ, మేకల అనిత, భిక్షపతి, కొమ్ముల కర్ణాకర్, సురేష్, విజయ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. నాల్గవసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్న జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు కొరివి వినయ్ కుమార్, పి.శంకర్, సహకరించిన నాయకులు, కార్యకర్తలకు రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

మెపా జిల్లా గౌరవ అధ్యక్షుడిగా రాణాప్రతాప్

కాజీపేట రూరల్: హనుమకొండ జిల్లా మెపా (ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్రం) గౌరవ అధ్యక్షుడిగా రావుల రాణాప్రతాప్ ముదిరాజ్ నియామకం అయ్యారు. ఈమేరకు కాజీపేటలోని మెపా కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయనకు రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ నియామక పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర కార్యదర్శులు నీరటి రాజు, సింగారపు రామకృష్ణ, దండు చిరంజీవి, హనుకొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నూనె శివకుమార్, అమ్మగారి శ్యామ్, ములుగు జిల్లా కన్వీనర్ కిషన్, శ్రీనివాస్, వినోద్, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మడికొండ పాత పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ బారి

మడికొండ: కాజీపేట మండలం మడికొండలోని పాత పోలీస్ స్టేషన్ భవనాన్ని సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ.బారి శుక్రవారం రాత్రి పరిశీలించారు. డీసీపీ వెంట వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్, క్రైం డీసీపీ విజయ్, స్థానికులు ఉన్నారు.

ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనంపై కాంగ్రెస్ ఆగ్రహం

హసన్‌పర్తి / ఖిలా వరంగల్ / హన్మకొండ/ కేయూ క్యాంపస్ : వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు దిష్టిబొమ్మను స్వేరోస్ స్టూడెంట్స్ నాయకులు దహనం చేయడంపై కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేపై స్వేరోస్ విద్యార్థి యూనియన్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. వరంగల్ ఆర్టీఏ జంక్షన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు జన్ను గణేష్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును విమర్శించే అర్హత స్వేరోస్‌కు లేదని కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్టీ సెల్ వరంగల్ జిల్లా చైర్మన్ రవీందర్ నాయక్ అన్నారు. ఎమ్మెల్యే నాగరాజుకు స్వేరోస్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుపై స్వేరో స్టూడెంట్స్ యూనియన్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేశారని, వాటిని ఖండిస్తున్నామని కేయూ టీం అండ్ కేయూ జేఏసీ బాధ్యుడు డాక్టర్ బండారి సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు వివరాలు నమోదు చేయాలి



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

హసన్‌పర్తి: రైతులు కొనుగోలు చేసిన విత్తనాల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని విత్తనాలు, ఎరువుల షాపు యజమానులకు తహసీల్దార్ చల్లా ప్రసాద్ సూచించారు. హసన్‌పర్తి మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఫర్టిలైజర్ షాపులను రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని ఫర్టిలైజర్ షాపులను తనిఖీలు చేసి రికార్డులు పరిశీలించారు. షాపుల్లో ఉన్న స్టాక్‌ను సరిచూశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేశాక తప్పనిసరిగా రసీదు పొందాలన్నారు. పంట పూర్తయ్యే వరకు రసీదును రైతులు భద్రపర్చుకోవాలన్నారు. డీలర్లు కృత్రిమ విత్తనాల కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల వ్యవసాయ అధికారి అనురాధ మాట్లాడుతూ అందుబాటులో వివిధ రకాలైన పత్తి విత్తనాలు వాడి అధిక దిగుబడి పొందాలన్నారు. హసన్‌పర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ జె.సురేష్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మినట్లయితే పీడీ యాక్ట్ కింద నమోదు చేస్తామని హెచ్చరించారు.


నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

హన్మకొండ: నేరాలు, అఘాయిత్యాలు, దాడుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వరంగల్ జిల్లా షీటీం ఎస్సై కంచి విద్యాసాగర్ సూచించారు. సైబర్ నేరాలు, మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, అఘాయిత్యాలపై హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో శుక్రవారం అవగాహన కార్యకమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఫేస్‌బుక్, ఇన్‌స్టా గ్రామ్ లాంటి సోషల్ మీడియాలో అమ్మాయిలు తమ వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలన్నారు. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని కోరారు. సైబర్ నేరాలు జరిగితే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఆపద సమయంలో మహిళలు 87126 85257, 87126 85142, 87126 85270 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏకశిల పార్కు వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజిరెడ్డి, జనరల్ సెక్రటరీ సోమయ్య, గవర్నర్ వెంకటేశ్వర్ రావు, కోటేశ్వర్ రావు, కమలాకర్ విజయ కుమార్, షీటీమ్ హెడ్ కానిస్టేబుల్ సూర్యనారాయణ, కానిస్టేబుల్ వంశీకృష్ణ పాల్గొన్నారు.



పోస్టర్లను ప్రదర్శిస్తున్న షీ టీమ్ ఎస్సై, తదితరులు

బలహీన వర్గాల్లో చైతన్యం నింపిన పూలే



నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థినులు

హన్మకొండ అర్బన్: కుల వ్యవస్థను నిరసిస్తూ సత్యశోధక్ సమాజాన్ని స్థాపించి సమాజంలోని అట్టడుగు, బడుగు, బలహీన వర్గాల్లో చైతన్యాన్ని నింపిన గొప్పవ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే అని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి కొనియాడారు. నగరంలోని వడ్డెపల్లిలోని కళాశాలలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్త్రీ విద్య కోసం పూలే బాలికల పాఠశాలు స్థాపించారని వివరించారు. ఆయన పోరాట ఫలితంగానే నేడు బడుగు, బలహీన వర్గాలకు అనేక ప్రయోజనాలు చేకూరుతున్నాయని తెలిపారు. పూలే ఆశయాలను నేటితరం కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సహకార సంఘాల ఎన్నికలకు ప్రతిపాదనల ఆహ్వానం

కాళోజీ సెంటర్: జిల్లాలోని అన్ని రకాల సహకార సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రతిపాదనలివ్వాలని జిల్లా సహకార అధికారి, జిల్లా అదనపు ఎన్నికల అధికారి బి.సంజీవరెడ్డి కోరారు. ఈనెల (జూన్) 6 నుంచి 28వ తేదీ వరకు అన్ని రకాల సహకార సంఘాలకు (కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘాలు, డెయిరీ, అర్బన్ సహకార బ్యాంక్స్, ప్లాట్ ఓనర్స్ సహకార సంఘాలు, చేనేత సహకార సంఘాలకు) ఎన్నికలు జరుగనున్నాయని తెలిపారు. ప్రతీ సంఘం నుంచి (ఎన్నికలు జరగని) ప్రతిపాదనలను సంబంధిత ఫంక్షనల్ రిజిస్ట్రార్స్ నుంచి జిల్లా అదనపు సహకార ఎన్నికల అధికారికి పంపించి రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీచే ఎన్నికలు జరిపించుకోవాలని సూచించారు. ఎన్నికలు జరగని సహకార సంఘాలకు జూన్ 6 నుంచి 28వ తేదీ వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో డిగ్రీకోర్సుల క్యాంపులో పలువురు దినసరి వేతన కూలీలు ఆన్సర్ బుక్‌లెట్ మార్చిన ఘటనపై ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పరీక్షల విభాగం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ మాట్లాడుతూ డబ్బుల కోసం విద్యార్థులను అడ్డదారిలో పాస్ చేయించేందుకు చేస్తున్న ఈ దందా వెనుక ఉన్న వారిని గుర్తించాలని డిమాండ్ చేశారు. ఆ దిశగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సంఘం కేయూ ఇన్‌చార్జ్ మచ్చ పవన్ కల్యాణ్, అధ్యక్షుడు దూడపాక నరేందర్, ప్రధాన కార్యదర్శి బండారి పృథ్వీరాజ్, ప్రదీప్, రత్నాకర్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఏబీఎస్ఎఫ్ బాధ్యులు